నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డులో గల 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ ఆర్. భానుప్రకాశ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మండలం లోని అహ్మదీపూర్, సింగాటం, బెజుగామ, ధర్మారెడ్డి పల్లి, బంగ్లావెంకటాపూర్, వర్గల్ మండలంలోని మజీద్‌పల్లి, నెంటూరు, రాయపోల్ మండల పరిధిలోని బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కావలండీ విటమిన్

విటమిన్ డీ పసిపిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో అవసరం. నవజాత శిశువులకైతే మరీ ముఖ్యం. వారి ఎదుగుదలకు, శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. డీ విటమిన్ ఎముకలు బలంగా ఉండడానికి, రోగనిరోధకశక్తిని పెంచుతుంది. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కొంతమంది నవజాత శిశువులను ఉదయం ఎండలో డీ విటమిన్ కోసం ఇలా ఒళ్లో కూర్చుబెట్టుకుని కెమెరా కంటపడ్డారు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి)



కాంగ్రెస్ చలో రాజ్‌భవన్
నిరసనలో నిర్మలాజగ్గారెడ్డి



రాజ్‌భవన్ వద్ద నిరసనలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో కలిసి ధర్నా నిర్వహించారు.

22 నుంచి మల్లన్న మూలవిరాట్టు
దర్శనం నిలిపివేత

చేర్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈనెల 22 నుంచి 29 వరకు స్వామివారి మూలవిరాట్టు దర్శనం నిలిపివేయనున్నారు. ఈ నెల 29న స్వామి వారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నందున మూలవిరాట్టు అలంకరణ, గర్భాలయ సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. దీంతో మూలవిరాట్టు దర్శనం తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. భక్తుల దర్శనార్థం ఆలయ అర్ధమండప ఆవరణలో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. కల్యాణం రోజున తెల్లవారుజామున దృష్టికుంభం నిర్వహించి, స్వామివారికి చిత్రకన్ను అమర్చిన అనంతరం గర్భాలయ ప్రవేశం, దర్శనం ప్రారంభించనున్నట్లు ఈవో బాలాజీశర్మ పేర్కొన్నారు. భక్తులు మార్పును గమనించి సహకరించాలని కోరారు.



కూలిపోయిన సెల్ఫ్


క్యూ కాంప్లెక్స్
పనులు నాసిరకం

- నిర్మాణంలోనే కూలుతున్న సెల్ఫ్‌లు
- కానరాని వాటర్ క్యూరింగ్



పగుళ్లు కనిపించకుండా సిమెంటుతో సరిదిద్దిన దృశ్యం

చేర్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న భక్తుల ప్రయోజనం కోసం సుమారు రూ.11 కోట్ల వ్యయంతో చేపట్టిన క్యూకాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ పనితీరుపై ఆది నుంచి వచ్చిన ఆరోపణలు.. పగుళ్లు, కూలివేత రూపంలో బలం చేకూరుస్తున్నాయి. సమపాళ్లలో సిమెంటు, ఇసుక, ఇనుము వినియోగించకపోగా, వాటర్ క్యూరింగ్ ఏమాత్రం చేపట్టడం లేదు. యేటా మూడునెలల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతీవారం జాతర కొనసాగుతుంది. ఈజాతరకు తెలంగాణ, ఆంధ్రా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి సంకల్పించారు. అందులో తాగునీటి వసతి, క్యూలైన్, మూత్రశాలలు, మరుగుదొడ్ల ఏర్పాటునకు చర్యలు తీసుకున్నారు. అయితే కొన్నాళ్ల క్రితం స్లాబ్‌దశలోనే పగుళ్లు పట్టి పెచ్చులూడాయి. ఈ విషయం అప్పటి కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ దృష్టికి రావడంతో ఆయన కాంట్రాక్టర్‌ను మందలించారు. అయినా ఆలయాధికారులు చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం రెండు అంతస్తుల శ్లాబ్, గోడల నిర్మాణం పూర్తవడంతో అస్తరుకారు చేస్తున్నారు. సెల్ఫ్‌ల సుందరీకరణ చేపడుతుండగా, ఇటీవల ఓ సెల్ఫ్ కూలిపోతే సరిచేశారు. బుధవారం సాయంత్రం మరో సెల్ఫ్ గోడ కూలింది. మరికొద్దిరోజుల్లో మల్లన్న కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. మొదటి అంతస్తు నుంచి క్యూలైన్లు ఏర్పాటుచేసి భక్తులను దర్శనానికి పంపించాలని నిర్ణయించారు. హడావిడిగా పనులు చేస్తున్న క్రమంలో భక్తులకు ప్రమాదం పొంచి ఉంది. ఈవిషయమై కలెక్టర్‌తో పాటు దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి పనులను నాణ్యతతో చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ఈవిషయమై ఈవో బాలాజీని వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.





విద్యుత్ శాఖలోని కొందరు సిబ్బంది వసూల్ రాజాలుగా మారారు..! పైసలు చేతిలో పడనిదే.. పని చేయడం లేదు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో కరెంటు లేనిదే ఏ పని జరగదు. దీన్నే విద్యుత్‌శాఖ సిబ్బంది తమకు అనుకూలంగా మలుచుకున్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అనధికారికంగా డబ్బు వసూలు చేస్తూ వారి జేబుకు చిల్లు పెడుతున్నారు.

- గజ్వేల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి)

విద్యుత్‌శాఖలో
వసూల్ రాజాలు!

- ప్రజల నుంచి డబ్బు గుంజుతున్న సిబ్బంది
- పైసలిస్తేనే ఫైల్ ముందుకు.. లేదంటే పెండింగ్
- గజ్వేల్ డివిజన్‌లోని రెండు సబ్‌డివిజన్లపై ఆరోపణలు
- అమ్యామ్యాలు ఇచ్చే కాంట్రాక్టర్లకే పనులు
- వ్యక్తిగత లాగిన్లు సైతం కాంట్రాక్టర్లకు అప్పగింత!
- లోపించిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

విద్యుత్‌శాఖలో నెలవారీ జీతం కన్నా అమ్యామ్యాలే ఎక్కువగా ఉంటున్నాయి. గజ్వేల్ డివిజన్ పరిధిలోని తుక్కాపూర్, ములుగు సబ్ డివిజన్లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నూతనంగా వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్‌కనెక్షన్లు మంజూరైతే చాలు కాసులపంటే. కాంట్రాక్టర్ల ద్వారా తమకు రావాల్సిన పర్సంటేజీలను అధికారులు వసూలు చేసుకుంటున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ పనిలో నాణ్యతకు తిలోదకాలిచ్చి కాంట్రాక్టర్లకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరిస్తూనే ఉన్నారు. వారికి నచ్చిన కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తూ.. వారి వద్ద నుంచి మామూళ్లు పుచ్చుకుంటున్నారు. ఇదే అదనుగా కాంట్రాక్టర్లు ఇష్టారీతిన ఎస్టిమేషన్(అంచనా) వేస్తూ డిస్కంలకు గండి కొడుతున్నారు. ఈ శాఖలో మార్పు తెచ్చేందుకు ఉన్నతస్థాయి అధికారులు ఎన్నిచర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అవినీతి, అక్రమాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. విద్యుత్ ఉద్యోగులు పనిచేస్తున్న ప్రాంతంలోనే వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్న నిబంధన ఉన్నా, ఎక్కడా అమలు కావడంలేదు. విధులు నిర్వహించే గ్రామాలకు 50 నుంచి 60కిలోమీటర్ల దూరంలో ఉండే పట్టణాలకు పరిమితమవుతున్నారు. చుట్టపుచూపుగా వచ్చివెళ్తూ తమ బినామీలతో పనులు చక్కబెట్టి నెలవారీ జీతభత్యాలను దర్జాగా తీసుకుంటున్నారు. యూనియన్ ప్రాబల్యం ఉన్నతాధికారులపై ఎక్కువైన నేపథ్యంలో అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కాంట్రాక్టర్ల వద్దనే అధికారుల వ్యక్తిగత లాగిన్లు

గజ్వేల్ డివిజన్ పరిధిలోని ములుగు, తుక్కాపూర్ విద్యుత్ సబ్ డివిజన్ల పరిధిలో కాంట్రాక్టర్ల రాజ్యం నడుస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఏ పని అయినా చేయాలంటే ఎస్టిమేషన్ వేసి ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందాలి. ఆ తర్వాత బడ్జెట్‌ను పొంది పనులను ప్రారంభించాలి. ఈ పనులను తప్పనిసరిగా అధికారులు తమశాఖ లాగిన్ల నుంచి చేయాల్సి ఉండగా, సదరు లాగిన్లు కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇదే అదునుగా కాంట్రాక్టర్లు లాగిన్ల ద్వారా నచ్చిన మేర ఎస్టిమేషన్లను వేస్తూ డిస్కంలకు గండి కొడుతున్నారు. ఇటు కస్టమర్ల నుంచి అటు కాంట్రాక్టర్ల నుంచి ఇష్టారీతిన లంచాలు లాగుతున్నారన్న ఆరోపణలున్నాయి.

ములుగు సబ్ డివిజన్‌లో రూ.వేలల్లో లంచాలు

ములుగు సబ్ డివిజన్ పరిధి హైదరాబాద్‌కు దగ్గరలో ఉండడం.. వందలాదిగా పరిశ్రమలు ఉండడంతో ఇక్కడ అధికారులు తమ పనిని మూడుపువ్వులు ఆరుకాయలుగా మార్చుకుంటున్నారు. బండ మైలారంలో ఓ పరిశ్రమకు సంబంధించిన పనిలో విద్యుత్ సిబ్బంది కాంట్రాక్టర్ ద్వారా కస్టమర్ నుంచి రూ.వేలల్లో డబ్బు వసూలు చేసినట్లు తెలిసింది. కొన్ని నెలలుగా సదరు పనిని పెండింగ్‌లో పెట్టిన అధికారి డబ్బు ముట్టజెప్పిన వెంటనే పనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే

మిగతా 8వ పేజీలో...



అడిషనల్ డీసీపీకి
ఎస్పీగా పదోన్నతి

- మల్లారెడ్డిని అభినందించిన సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డిని ఎస్పీగా పదోన్నతిపై రాచకొండ ట్రాఫిక్ డీసీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఎస్పీ మల్లారెడ్డి బుధవారం సిద్దిపేట సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలుసుకుని పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మల్లారెడ్డిని అభినందించారు. అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని సీపీ తెలిపారు. పదోన్నతి పొందిన ఎస్పీ మల్లారెడ్డిని ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, కార్యాలయ సూపరింటెండెంట్ మహ్మద్ ఫయాజుద్దీన్, మహమ్మద్ అబ్దుల్ ఆజాద్, సీసీ నితిన్‌రెడ్డి, పీఆర్‌వో మల్లికార్జున్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు.

'ఇథనాల్ కంపెనీకి అనుమతులివ్వొద్దు'

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండలంలో గుగ్గిళ్ల, పోతారం గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శశిధర్ మాట్లాడుతూ కంపెనీ వలన చుట్టుపక్కల 10 గ్రామాల పరిధిలో భూసారం దెబ్బతిని పంటలకు భూమి పనికి రాకుండా పోయి ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ పరిశీలించి కంపెనీ అనుమతులను రద్దు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలస్వామి తదితరులు ఉన్నారు.

బ్యాట్ పడితే
బౌండరీలే

- క్రికెట్‌లో దూసుకుపోతున్న గగ్నీక్షా
- వయస్సు 8..మ్యాచులు 46
- ప్రముఖ క్రికెటర్లతో ప్రశంసలు

7

ఫోక్ సింగర్
శృతి ఆత్మహత్య



- ఇన్‌స్టాలో యువకుడు పరిచయం
- 21 రోజుల క్రితం ప్రేమ వివాహం
- హత్య చేశారని మృతురాలి బంధువుల ఆరోపణ

7

గాడి తప్పిన
గ్రామపాలన

- సిద్దిపేట అర్బన్ మండలంలో గ్రామసభల ఊసే లేదు
- ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువు

8



క్రీడోత్సాహం

- సందడిగా సీఎం కప్ క్రీడలు

సిద్దిపేట కల్చరల్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో సీఎం కప్ క్రీడలు-2024 సందడిగా సాగుతున్నాయి. బుధవారం రెండోరోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నా రు. ఇలాంటి క్రీడాపోటీల వల్ల మట్టిలో మాణిక్యాలను వెలికితీసే అవకాశముందని వ్యాయామ ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జాతీయస్థాయి వేదికల మీద ఆడిన ఆటగాళ్లు కూడా ఈ పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. పలువురు క్రీడాకారులు 'ఆంధ్రజ్యోతి'తో వారి మనోగతం పంచుకున్నారు.

మూడు జాతీయస్థాయి వేదికలపై ఆడాను




- సిద్దు, కబడ్డీ ఆటగాడు

హుస్నాబాద్ కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. జూనియర్స్ స్టేట్‌మీట్‌లో పాల్గొన్నాను. మూడు సార్లు సౌత్‌జోన్ యూనివర్శిటీకి ఆడాను. సీఎం కప్ క్రీడలు పెట్టడం చాలా బాగుంది. ఇందులో ప్రతిభ కనబరిస్తే మంచి వేదికల మీద ఆడే అవకాశం వస్తుంది.

క్రీడల వల్ల చెడు వ్యసనాలకు దూరం

- మహ్మద్ అల్ఫాజ్, హుస్నాబాద్



సౌత్‌జోన్ నేషనల్ లెవల్లో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాను. ఇలాంటి క్రీడల వల్ల ఆటలపై మక్కువ పెరుగుతుంది. చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉంటారు. ఈ తరహా క్రీడల వల్ల గ్రామీణస్థాయిలోని క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

- ఐశ్వర్య, క్రీడాకారిణి



సీఎం కప్ వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జాతీయస్థాయికి వెళ్లడానికి కూడా మార్గం సుగమం అవుతుంది.

సోషల్ మీడియాకు దూరం

- వెన్నెల, పావని, స్రవంతి జడ్పీహెచ్ఎస్ తీగుల్, జగదేవ్‌పూర్ మండలం



మేం జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నాం. ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో పార్టిస్పేట్ చేశాం. గ్రామీణ నేపథ్యమున్న క్రీడాకారులకు ఇదొక మంచి అవకాశం. ఆటలకు దగ్గరవ్వడం వల్ల సోషల్‌మీడియా, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండే అవకాశం ఉంటుంది.



సొమ్ములు లేకున్నా.. సోకులు..!

- ఖజానాలో రూ. లక్షా 18 వేలే
- మీటింగ్ హాల్ సుందరీకరణకు రూ. 40 లక్షలు
- పదేళ్ల క్రితమే రూ. 20 లక్షలతో రెనోవేషన్
- ఇప్పటికే స్టడీ టూర్ పేరిట రూ. లక్షలు వృథా
- ఇదీ.. సదాశివపేట మున్సిపాలిటీ పాలకవర్గం తీరు



సదాశివపేట, డిసెంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఖజానాలో ఉన్నవి రూ. లక్షా 18 వేలు. కానీ, మీటింగ్ హాల్ రినోవేషన్‌కు అధికారులు పెడుతున్న ఖర్చు రూ. 40 లక్షలు. అన్ని నిధులు ఎక్కడి నుంచి తెస్తారు. మరి కొద్ది రోజుల్లో పదవీ కాలం పూర్తవుతున్న పాలక వర్గం ఇంత ఖర్చుతో సమావేశ హాల్ ఇన్నోవేషన్ కోసం అన్ని నిధులు ఎందుకు ఖర్చు చేస్తోంది అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌ను రూ. 40 లక్షలతో సుందరీకరించేందుకు 2022లో అప్పటి పాలకవర్గం (తీర్మానం నంబర్: 382) ఆమోదముద్ర వేసింది. అయితే, అప్పట్లో పలుమార్లు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఆ పనులు చేపట్టలేదు. అనంతర పరిణామాల్లో చైర్మన్ మారడం.. మరి కొన్ని రోజుల్లో ప్రస్తుత పాలక వర్గ పదవీ కాలం పూర్తి కానున్న నేపథ్యంలో పాత ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చారు. పాత తీర్మానం ప్రకారం టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంతో పనులూ ప్రారంభించారు. వాస్తవానికి ఈ మీటింగ్ హాల్‌ను 2014లోనే సుందరీకరించారు. రూ. 20 లక్షల వ్యయంతో ఏసీలు, ఫర్నిచర్, ఫాల్ సీలింగ్, సౌండ్ సిస్టమ్ వంటి పనులు చేపట్టారు.

తాజాగా మళ్లీ సాధారణ నిధుల నుంచి రూ. 40 లక్షలు వెచ్చించడం.. అదీ పదవీ కాలం పూర్తి కావొస్తున్న తరుణంలో పనులు చేపట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గి బాధ్యతలు తీసుకున్న చైర్‌పర్సన్ తన పదవీ కాలంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. అయితే, కొత్త చైర్‌పర్సన్‌కు మద్దతుగా నిలిచిన కౌన్సిలర్లను సంతృప్తిపరచడమే ధ్యేయంగా మున్సిపల్ నిధులు ఖర్చు చేస్తున్నారని అంటున్నారు. నాలుగు నెలల క్రితమే రూ. 15 లక్షలతో కౌన్సిలర్లు చండీగఢ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడమే వృథా ఖర్చు అని భావిస్తున్న నేపథ్యంలో మీటింగ్ హాల్ రెనోవేషన్ వారి జేబులు నింపుకునేందుకే అని ప్రజలు అంటున్నారు.

జనరల్ ఫండ్ రూ.1.18 లక్షలు మాత్రమే

బల్దియా ఖజానాలో ఈ నెల 12 నాటికి జనరల్ ఫండ్ నిల్వ కేవలం రూ. లక్షా 18 వేల 452 మాత్రమే ఉంది. సిబ్బంది జీతాలకు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. ఆదాయం పెంచుకోవంలో పూర్తిగా విఫలమైంది. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో బహుళ అంతస్థుల భవనాలు, భారీ కమర్షియల్ సముదాయాలు, విస్తరించిన పాత, కొత్త పరిశ్రమలు, ఫంక్షన్ హాల్స్ షాపింగ్ మాల్స్‌ల నుంచి తూతూ మంత్రంగా ఆస్తిపన్ను వసూలు చేయడంతో బల్దియా ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆయా యాజమాన్యాల నుంచి మామూళ్లు అందుకుని వారికి నామమాత్రంగా ఆస్తిపన్ను విధిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బల్దియా ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సరిగ్గా లేని, పదవీ కాలం పూర్తి కావొస్తున్న సమయంలో రూ. 40లక్షలతో మీటింగ్ హాల్ రినోవేషన్ అవసరమా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరాన్ని సుందరీకరిస్తున్న దృశ్యం

గురుకులాల్లో నిరంతర తనిఖీలు

- భోజనంలో లోపం కనిపిస్తే కఠిన చర్యలు
- కొత్త మెనూ పక్కాగా అమలు చేయాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా కేంద్రంలోని గురుకులాల్లో ఆకస్మిక తనిఖీ


బాలికల పాఠశాలలో వంట తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి, గురుకులాల్లో నిరంతరం తనిఖీ నిర్వహిస్తామని, భోజన నాణ్యత విషయంలో ఏదైఆన లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ గురుకుల బాలికల, సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార మెనూ, వంట గది, స్టోర్‌రూం, డైనింగ్ హాల్, వసతులు, భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భోజన నాణ్యతపై విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొత్త మెనూ అమలు చేయాలని ఆయా ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఇంటర్ విద్యాబోధనలో సమూల మార్పులు అవసరం

ఇంటర్ విద్యాబోధనలో సమూల మార్పులు అవసరమని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనా మెలుకువలు నేర్పాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వం అన్ని వసతులు మెరుగుపరుస్తుందని, దానికి అనుగుణంగా లక్ష్యాలను సాధించడంలో నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రథమ, ద్వితీయ విద్యార్థులను కళాశాల వారీగా విభజించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఇంటర్ ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ సమావేశంలో ఇంటర్ జిల్లా నోడల్ అధికారి మాధవి, కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వసతి గృహ సంక్షేమ అధికారులు

జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారులు టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశారు. నూతనంగా అమలు చేస్తున్న కొత్త మెనూను ఆహ్వానిస్తూ.. విద్యార్థుల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన మెనూ అమలుకు కావాల్సిన పరికరాలు, సౌకర్యాలను కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ శాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు శేషాచారి, వార్డెన్‌లు పాల్గొన్నారు.

జోగిపేట ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స


క్షతగాత్రుడికి శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

జోగిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట ఏరియా ఆసుపత్రిలోని వైద్యులు బుధవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. మూడురోజుల క్రితం కామారెడ్డికి చెందిన కుమ్మరి రాజు(38) బైక్ నడుపుతూ అన్నాసాగర్ వద్ద డివైడర్‌కు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడి ఎడమ మోకాలి వద్ద ఎముక విరిగింది. ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఆనంద్‌నాయక్ తోటి వైద్యులతో కలిసి విరిగిన ఎముకను అతికించే శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశామని పేర్కొన్నారు.

కేవీకేను సందర్శించిన కలెక్టర్



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కౌడిపల్లి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 18: మండల పరిధిలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రానికి(కేవీకే) ఈ నెల 25న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానుండడంతో కలెక్టర్ రాహుల్‌రాజ్ కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ హెలీప్యాడ్‌ల ఏర్పాటులో రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. 25న క్రిస్మస్ పండగా సందర్భంగా జాతీయ రహదారి రద్దీగా ఉండే అవకాశం ఉందని, వారు విమానాశ్రయం నుంచి నేరుగా హెలీకాప్టర్‌లో ఇక్కడికి వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు నిర్వహించే సభ ప్రాంగణములో సరిపడా కుర్చీలు ఉండేలా చూడాలన్నారు. సేంద్రియ ఉత్పత్తులు ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై కేవీకే అధికారులను ఆరా తీశారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ సర్ధాసింగ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త సంబాజీ దత్తాత్రేయ నస్కర్, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు రవి తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండండి

● జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్



విద్యార్థులతో మాట్లాడుతున్న గోవింద్ రామ్

జోగిపేట, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) గోవింద్ రామ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆయన జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇంటర్ పరీక్షలు విద్యార్థుల జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయని, సమయాన్ని వృథా చేయకుండా చదవుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొమ్ము రజిత, అధ్యాపకులు శ్రీనివాసులు, విఠల్, గోవర్ధన్‌రెడ్డి, నూనె శ్రీనివాస్, రాజ్‌కుమార్, మల్లేశం, ప్రసన్న పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు తనిఖీ



ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

కంది, డిసెంబరు 18 : కందిలోని సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ బుధవారం తనిఖీ చేశారు. జైలు మొత్తం కలియతిరుగుతూ పరిశీలించారు. సదుపాయాలను, భోజనం గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించడంతో పాటు ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూశారు. బెయిల్స్, ములాకత్‌లపై ఆరా తీశారు. ఖైదీలు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలకు నిబంధనల ప్రకారం అవసరమైన సదుపాయాలు అందేలా చూడాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.

బైక్ దొంగకు ఏడాది జైలు శిక్ష

గజ్వేల్ రూరల్, డి సెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ దొంగతనం కేసులో నేరస్థుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ గజ్వేల్ కోర్టు అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పు వెల్లడించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల పట్టణం జాంబాగ్ నివాసానికి చెందిన మహ్మద్ అక్తార్ అలియాస్ రషీద్ జనవరి నెలలో గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ సమీపంలో బైక్‌ను తస్కరించాడు. ఈ కేసులో అతడిపై పోలీసులు చార్జీసీట్ దాఖలు చేయగా విచారణ జరిపిన కోర్టు నేరం చేసినట్లు తేల్చింది. ఈ మేరకు ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది.

బ్యాట్ పడితే బౌండరీలే

క్రికెట్‌లో దూసుకుపోతున్న గగ్నీక్షా

● వయస్సు 8 ఏళ్లు.. మ్యాచ్‌లు 46

● ప్రముఖ క్రికెటర్లతో ప్రశంసలు

క్రికెట్‌లో చిచ్చరపిడుగులా రెచ్చిపోతున్నది సంగారెడ్డికి చెందిన ఎనిమిదేళ్ల గగ్నీక్షా. జానీ, జానీ.. ఎస్ పప్పా అంటూ రైమ్స్ నేర్చుకోవాల్సిన ప్రాయంలో బ్యాట్ పట్టి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. గ్రౌండ్‌లోకి దిగిందంటే సిక్సులు, ఫోర్లతో పరుగుల వరద పారిస్తున్నది.



ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మతో గగ్నీక్షా

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని గాయత్రినగర్‌లో నివాసముండే మంజుల, ప్రదీప్ దంపతుల కూతురు గగ్నీక్షా స్టేడియంలో గ్రౌండ్‌లో అడుగుపెట్టిందంటే చాలు తన ఆటకు చప్పట్లు, కేరింతలు మోగాల్సిందే. మల్కాపూర్‌లోని రాహుల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడవ తరగతి చదువుతున్న ఈ చిన్నారి ఐదేళ్ల వయస్సులోనే స్థానికంగా ఉన్న అక్షర క్రికెట్ అకాడమీలో కోచ్‌లు అమర్‌గౌడ్, సల్మాన్‌ల వద్ద శిక్షణ పొందుతోంది. చిన్నారి ప్రతిభను గుర్తించిన కోచ్‌లు ప్రత్యేక శ్రద్ధతో శిక్షణనందిస్తున్నారు. అతి చిన్న వయస్సులోనే వివిధ టోర్నమెంట్లలో 46 క్రికెట్ మ్యాచ్‌లు ఆడింది. 4 ఆఫ్ సెంచరీలు నమోదు చేసింది. తన ఆటతో ప్రముఖ ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, ఇండియన్ మహిళా క్రికెటర్ యశశ్రీల మన్ననలు పొందింది. మరోవైపు చదువులోనూ రాణిస్తూ ఇతర చిన్నారులకు ఆదర్శంగా నిలుస్తోంది గగ్నీక్షా. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంపికైనా వయస్సు అడ్డు రావడంతో అవకాశం కోల్పోయింది. ఏజ్ ఎలిజిబుల్ అయ్యాక హైదరాబాద్‌లోని రవిశాస్త్రీ క్రికెట్ అకాడమీలో శిక్షణ అందిస్తామని అకాడమీ నిర్వాహకులు తెలుపడం విశేషం.

ఇండియా టీమ్‌లో ఆడడమే లక్ష్యం..

చదువుతోపాటు క్రికెట్ ఆడడంలో నన్ను మా తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహిస్తున్నారు. కోచ్‌లు అమర్‌గౌడ్, సల్మాన్‌లు తనకు ప్రత్యేకంగా ట్రైనింగ్ ఇస్తున్నారు. తాను భవిష్యత్తులో మహిళా ఇండియన్ క్రికెట్ టీమ్‌లో ఆడడమే లక్ష్యం. దానికి ట్రైనింగ్ ఎంత కఠినంగా ఉన్నా కష్టపడతాను. ఇప్పటివరకు ఆడిన టోర్నమెంట్లలో మంచి పరుగులు చేసినందుకు సీనియర్ క్రికెటర్లు అభినందించడం మరువలేను.

- గగ్నీక్షా, చిన్నారి క్రికెటర్, సంగారెడ్డి

తల్లిదండ్రుల ప్రోత్సాహం

ఆడపిల్ల అని ఆటపాటలెందుకని అనుకోలేదు చిన్నారి గగ్నీక్షా తల్లిదండ్రులు. పిల్లలకు ఏ రంగంలో ఆసక్తి ఉంటే అదే రంగంలో వారిని ప్రోత్సహిస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని నమ్మి ప్రోత్సహించారు. క్రికెట్‌లో క్రీడలు, చదువుకు ఆడ, మగ అనే తేడాలు ఉండకూడదని గగ్నీక్షాకు ఆసక్తి ఉన్న రంగం క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణనందించారు. చిన్నారి ఆటను చూసి పలువురు ఇంత పిన్న వయస్సులో ఇంత ప్రతిభ కనబరుస్తుందా అంటూ ఆశ్చర్యానికి లోనవుతున్నారు. భవిష్యత్తులో పెద్ద క్రికెటర్‌గా రాణిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



షీల్డుతో చిన్నారి కుటుంబం

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొన్న బైక్ యువతి మృతి

కొల్చారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కొల్చారం లోతు వాగు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మహమ్మద్‌గౌస్ కథనం ప్రకారం ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన స్వప్న, శ్రీను ద్విచక్రవాహనంపై నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో స్వప్న అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన శ్రీనును చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు..



లోకేశ్వర్‌రెడ్డి (ఫైల్)

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 18 : ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందాడు. బీడీఎల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బానూర్ గ్రామానికి చెందిన లోకేశ్వర్‌రెడ్డి(27) పాశమైలారం ప్యూరో పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం విధి నిర్వహణలో పరిశ్రమ మూడవ అంతస్థులో సోలార్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని పటాన్‌చెరులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

పాపన్న పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బలుపాటి ఆనంద్ (33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్నిరోజుల క్రితం అతడు మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఏడుపాయల ఆలయ సమీపంలోని మంజీరా నది ఒడ్డున చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు న్నారు. మృతుడి అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

● నిందితుడికి రిమాండ్



నిందితుడు సంగమేశ్వర్

పుల్‌కల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన పుల్కల్‌కు చెందిన పెద్దలోడి సంగమేశ్వర్ (41) ఈ నెల 16న రాత్రి 8 గంటలకు పుల్కల్ బస్టాండు వద్ద గందరగోళం సృష్టిస్తుండగా స్థానికులు డయల్ 100 కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సంగమేశ్వర్‌ను సముదాయించారు. అయినా వినకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ అక్కడకి వెళ్లి సంగమేశ్వర్‌కు నచ్చజెప్పె ప్రయత్నం చేశాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్‌ను అతడు దుర్భాషలాడుతూ చేతి రెండు వేళ్లను తాళం చెవి మధ్యలో ఇరికించి దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

మానవ మేథకు కృత్రిమ మేథ సాటిరాదు

● బఫెలో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వేణు గోవిందరాజు



మాట్లాడుతున్న డాక్టర్ వేణు గోవిందరాజు

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 18 : మానవ మేథకు కృత్రిమ మేథ సాటిరాదని అమెరికాలోని బఫెలో విశ్వవిద్యాలయ పరిశోధన, ఆర్థికాభివృద్ధి విశిష్ట ఆచార్యుడు డాక్టర్ వేణు గోవిందరాజు అన్నారు. లక్షల సంవత్సరాల పరిణామ ప్రక్రియల ద్వారా రూపొందించబడిన లక్షణం, సందర్భాన్ని బట్టి క్రియాశీలంగా వ్యవహరించే ప్రత్యేక సామర్థ్యాన్ని మానవులు కలిగి ఉన్నారన్నారు. దీనికి విరుద్ధంగా డేటాసెట్‌లపై కృత్రిమ మేథ ఆధారపడి అనుకరించే సామర్థ్యానికి పరిమితమవుతోందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'కృత్రిమ మేథ వికాసం: మానవ భాషా కమ్యూనికేషన్‌పై దృక్కోణం' అనే అంశంపై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. చెక్ లిస్టులు, పరీక్షలు, పరిశీలనలతో కృత్రిమ మేథ మనకు సాయపడుతున్నప్పుడు, మానవ ఆలోచన సంక్లిష్టతను ప్రతిబింబించడంలో సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. పది భావోద్వేగ స్థితులైన ఏకాగ్రత, గందరగోళం, ధ్యానం, నిరాశ, బాధ, సందేహం, ఆసక్తి, సాక్షాత్కారం, విశ్వాసం, విసుగు వంటివి అభ్యాస ప్రక్రియలో ఉంటాయన్నారు. సంక్లిష్ట లక్ష్యాలను సాధించడానికి వివిధ ఏజెంట్ల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తూ, తెలివితేటలు ద్రవం వలె ఆయా పరిస్థితులను బట్టి మారుతుంటాయన్నారు. మేధస్సు అనేది సహజంగానే సామాజికమైనది, పరస్వరం ఆధారపడి ఉంటుందని స్పష్టీకరించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి అతిథిని స్వాగతించగా, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు సత్కరించారు. అనంతరం గీతంలోని డైరెక్టర్లు, విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులతో ముఖాముఖి చర్చించారు.

మొక్కుబడిగా 'ఎల్‌సీడీసీ' సర్వే

● ముగిసిన 'కుష్టు' అనుమానితుల గుర్తింపు సర్వే

● 15 లక్షల జనాభాలో లక్ష 70 వేల మందికే సర్వే

● జిల్లాలో 138 మంది గుర్తింపు

● రెండేళ్ల నుంచి ఆశాలకు అందని సర్వే డబ్బులు

● ఈసారి సర్వేపై విముఖత.. అధికారుల ఒత్తిడితో మమ



సంగారెడ్డిలో ఎల్‌సీడీసీ సర్వేలో ఆశా కార్యకర్తలు, అధికారులు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) సర్వే ఆదివారంతో ముగిసింది. ఈ నెల 2 వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు నిర్వహించిన 'కుష్టు' అనుమానితుల గుర్తింపు సర్వే జిల్లాలో మొక్కుబడిగా సాగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ వైపు చర్మానికి, నరాలకు సోకి ఇబ్బంది పెట్టే ఈ కుష్టు వ్యాధి చాప కింద నీరులా విస్తరిస్తున్నది. ఈ తరుణంగా ఆదిలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. కానీ జిల్లాలో 14 రోజుల పాటు నిర్వహించిన మొక్కుబడి ఎల్‌సీడీసీ సర్వేతో ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఆసక్తి చూపని ఆశాలు..

జిల్లా వ్యాప్తంగా ఎల్‌సీడీసీ పేరిట ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయాలని వైద్య ఆరోగ్య శాఖ గత నెల ఆదేశాలు జారీ చేసింది. చర్మంపై స్పర్శలేని మచ్చలు, ఇతర మచ్చలున్నాయా? అంటూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని సూచించింది. అయితే రెండేళ్ల నుంచి ఆశాలు చేసిన ఎల్‌సీడీసీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. అందుకే ఈ ఏడాది సర్వే చేసేందుకు ఆశా కార్యకర్తలు ఆసక్తి చూపలేదు. ఎల్‌సీడీసీ సర్వే చేయబోమని ముందస్తుగా వైద్యాధికారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కానీ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే మమ అనిపించారనే ఆరోపణలున్నాయి. ఇంటింటికి తిరగకుండానే తిరిగినట్టు సర్వే రిపోర్టు రోజూ అధికారులకు పంపినట్టు తెలిసింది.

138 మంది గుర్తింపు..

జిల్లా వ్యాప్తంగా 1,70,129 మందిని సర్వే చేయగా, ఇందులో 138 మంది కుష్టు అనుమానితులను గుర్తించారు. జిల్లాలో సుమారు 15 లక్షల జనాభా ఉంటే అందులో కేవలం లక్ష 70 వేల మందినే సర్వే చేయడం మొక్కుబడి సర్వే చేశారనే నిదర్శనానికి అద్దపడుతున్నది. జిల్లాలోని సగానికిపైగా పీహెచ్‌సీ ఏరియాల్లో ఇంటింటి సర్వే చేయలేదని ఓ వైద్యాధికారి తెలిపారు. కొన్ని చోట్ల సర్వే నామమాత్రంగా చేశారనడానికి అధికారులు ఇచ్చిన గణాంకాలే నిదర్శనం. ఇలాంటి తరుణంగా జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలన ఏ మేరకు సాధ్యమవుతుందో వైద్య ఆరోగ్య శాఖ అధికారులకే తెలియాలి. జిల్లాలో జరిగిన మొక్కుబడి సర్వేతో ఉన్నతాధికారులు ఏమేరకు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

నిరసనలో జహీరాబాద్ ఎంపీ



నిరసనలో పాల్గొన్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఆవరణలో బుధవారం చేపట్టిన నిరసనలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. వెంటనే అమిత్‌షా క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ ఎంపీలు నిరసనకు దిగారు.

ఫోక్ సింగర్ ఆత్మహత్య

● 21 రోజుల క్రితం ప్రేమ వివాహం

● ఇన్‌స్టాలో పరిచయంతో పెళ్లి

● హత్య చేశారంటున్న బంధువులు

జగదేవ్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్ స్టాగ్రామ్‌లో పరిచయం కాస్త ప్రేమగా మారి 21 రోజుల క్రితం పెళ్లి చేసుకుంది. ఏం జరిగిందో ఏమో కానీ, బుధవారం ఫోక్ సింగర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లిలో బుధవారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్ర బిక్షపతి సత్తమ్మ దంపతుల కుమారుడు దయాకర్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిజామాబాద్ జిల్లా మోసర మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ శృతి(26) జానపద పాటలు పాడి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో దయాకర్‌తో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారి 21 రోజుల క్రితం పీర్లపల్లి గ్రామంలో దయాకర్ కుటుంబ పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వారి ప్రేమ వివాహానికి శృతి తరపున బంధువులు ఎవరూ రాలేదు. అయితే, బుధవారం గ్రామంలోనే దయాకర్ బంధువుల దశదిన కర్మ ఉండటంతో కుటుంబ సభ్యులంతా వెళ్లారు. శృతి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. దశ దిన కర్మ కార్యక్రమానికి శృతిని తీసుకెళ్లేందుకు భర్త దయాకర్ రాగా, అప్పటికే ఇంట్లో ఉరి వేసుకుని కనిపించింది. కిందికి దించి చూడగా, అప్పటికే చనిపోయి ఉంది. దీంతో శృతి తల్లిదండ్రులకు సమాచారం అందించగా, వారు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు.



శృతి మృతదేహం

కూరగాయల అంటు మొక్కలతో అధిక దిగుబడులు



శాస్త్రవేత్తను సన్మానిస్తున్న అధికారులు

ములుగు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంటు మొక్కలతోనే అధిక దిగుబడి సాధ్యమవుతుందని ఉద్యాన విశ్వ విద్యాలయం గౌరవ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. బుధవారం ములుగు మండల కేంద్రంలోని హార్టికల్చర్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అన్ని రకాల కూరగాయలు సంవత్సరం పొడవునా అందుబాటులో ఉండేలా ఉత్పత్తి జరగాలన్నారు. ఆ దిశగా పరిశోధనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. షేక్.ఎన్. మీరా మాట్లాడుతూ కూరగాయల సాగులో అంటుకట్టే విధానంపై శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలోని కృషి విజ్ఞాన కేంద్రాల్లో కూరగాయ అంటు మొక్కల ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. అనంతరం అంటు కట్టే పద్ధతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను సన్మానించారు. కేవీకే విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ విజయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా 2007 బ్యాచ్

● రూ.4 లక్షల ఆర్థికసాయం



మృతుడు వెంకటేశ్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న 2007 బ్యాచ్ సభ్యులు

మెదక్ అర్బన్ /సిద్దిపేట క్రైం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని దౌల్తాబాద్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పూసల వెంకటేశ్ ఈ నెల 18న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి కుటుంబానికి ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన 2007 బ్యాచ్ కానిస్టేబుళ్లు అండగా నిలిచారు. ఈ మేరకు తిరుపతిలోని కల్యాణి పోలీస్ ట్రైనింగ్ ద్యాంతోపాటు 2007 బ్యాచ్ కానిస్టేబుళ్లు కలిసి రూ.4 లక్షల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు నర్సింహులు, సుధాకర్‌రావు, కృష్ణగౌడ్, మహిపాల్, రెడ్యానాయక్, నాగరాజు, యాదగిరి, మహేష్, వెంకటేశ్, రమేష్, కృష్ణ, వినయ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గాడి తప్పిన గ్రామ పాలన

- సిద్దిపేట అర్బన్ మండలంలో గ్రామసభల ఊసే లేదు
- ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువు
- పంచాయతీ కార్యదర్శుల ఇష్టారాజ్యం
- సమస్యల పరిష్కారంలో విఫలం



మిట్టపల్లి గ్రామపంచాయతీ భవనం

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసిన నాటి నుంచి గ్రామాల్లో పాలన గాడి తప్పిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచ్ పదవులు ఉన్నప్పుడు ప్రజలకు ఏ సమస్య వచ్చినా వారికి విన్నవించుకునేవారు. గ్రామసభలను నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు చొరవ చూపేవారు. వారి గడువు ముగిసిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక పాలన అధికారులకు బాధ్యతలను అప్పగించింది. మండలంలోని ఆయా గ్రామాలకు మండల అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించింది. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులను పర్యవేక్షించి సమస్యలను స్పెషల్ ఆఫీసర్లకు తెలిపితే వాటిని పరిష్కరించడానికి ఇరువురు కృషి చేయాలి. కానీ నేటి వరకు ఎక్కడా ఇలాంటి పరిస్థితులు కనిపించలేదు. సిద్దిపేట అర్బన్ మండల వ్యాప్తంగా 12 గ్రామ పంచాయతీల్లో 12 మంది స్పెషల్ ఆఫీసర్లు ఉన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ ఏదీ?

గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించిన అధికారులు వారానికి ఒకసారి గ్రామాలకు తప్పదన్నట్టుగా వచ్చి వెళ్తున్నారు. గ్రామాలకు వచ్చినప్పుడు గ్రామస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక పంచాయతీ కార్యదర్శుల విషయానికి వస్తే అసలు గ్రామాల్లో వారిదే ఇష్టారాజ్యంగా మారిందని విమర్శిస్తున్నారు. మండలంలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగిన తర్వాత కొత్తగా వచ్చిన వారి గురించిన సమాచారం గ్రామస్థులకే సరిగా తెలియకపోవడం వల్ల సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. స్పెషల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా మారిందని ప్రజలు మండిపడుతున్నారు.

తూతూ మంత్రంగా గ్రామసభలు

ప్రత్యేక అధికారులు వచ్చినప్పటి నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో ఒకటి రెండుసార్లు నిర్వహించిన గ్రామసభలు తూతూ మంత్రంగానే ముగిశాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే సమయంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు వివరించాల్సిన అధికారులు ఎటువంటి సభలు నిర్వహించకుండానే నేరుగా పథకాలను గ్రామాల్లో ప్రవేశపెట్టడం వల్ల గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వ పథకాల గురించి పూర్తిగా వివరించాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల సమస్యలపై దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నేడు గజ్వేల్‌లో సీఎం కప్-2024 చెస్ ఎంపికలు

గజ్వేల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో జిల్లా స్థాయి అండర్-14 బాల, బాలికల చెస్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఆర్డీవో, ఇన్‌చార్జి డీవైఎస్‌వో జయదేవ్ ఆర్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 జనవరి 2010లోపు జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని, వివరాలకు 9989170936 (ఎలియాస్ రావు) నెంబర్‌కు సంప్రందించాలని కోరారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెస్ క్రీడా పోటీల్లో సిద్దిపేట జిల్లా తరఫున పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

మల్లన్న కల్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

చేర్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఈ నెల 29వతేదీన జరగనున్న స్వామివారి కల్యాణానికి హాజరుకావాలని కోరుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆలయాధికారులు ఆహ్వాన పత్రిక హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కోహెడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోహెడలోని సాయిబాబా ఆలయ సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

సిద్దిపేట క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన షాదుల్లా(27) ఈ నెల 9వ తేదీన పెయింటింగ్ వర్క్ కోసం తన స్నేహితుడు భాస్కర్‌తో కలిసి ఆటోలో సిద్దిపేటకు వచ్చాడు. ఈ క్రమంలో మోహిన్‌పుర రోడ్‌లో ఆటో డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో షాదుల్లా తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ..



మృతి చెందిన వ్యక్తి

సిద్దిపేట క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం సిద్దిపేట పట్టణ శివారులోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద స్పృహ లేని స్థితిలో పడిఉన్న ఓ వ్యక్తిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆసుపత్రి సిబ్బంది వివరాల ప్రకారం.. మృతుడు సంగారెడ్డి గ్రామానికి చెందిన వెంటేశం అని, అతడి తండ్రి పేరు వీరయ్య అని తెలిసింది. కాగా మృతుడి వయస్సు సుమారు 55 సంవత్సరాల లోపు ఉంటుందని, ఎత్తు 5.7అడుగులు ఉంటుందని టూ టౌన్ పోలీసులు తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే సెల్ నెంబర్ 8712667314 సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

మోటార్ సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కొండపాక, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెడ శివారులో మోటర్ సైకిల్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మహ్మద్ అక్బర్, మహ్మద్ రియన్ అనే ఇద్దరు మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న క్రమంలో దుద్దెడ శివారులో మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడి ఇద్దరికీ గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ఉద్యోగులకు హామీ ఇచ్చి విస్మరించడం సరికాదు



ధర్నాలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని గత 7 రోజులుగా సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న ధర్నా కార్యక్రమం బుధవారం కొనసాగింది. సమ్మెకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో సంఘం నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆ తర్వాత విస్మరించడం సరైనది కాదని వారికి న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కమిటీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలకిషన్, నవీన్‌కుమార్ మాట్లాడుతూ గురువారం సిద్దిపేటలో సమగ్ర శిక్షా ఉద్యోగుల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టనున్నామని తెలిపారు.

ఖమ్మం జిల్లా తిరుమలయపాలెంకు చెందిన సీసీవో హైమావతి ఉద్యోగభద్రత లేదని మనస్తాపంతో మృతి చెందడం పట్ల ఉద్యోగులు మౌనం పాటించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు చిర్రా యాదగిరి, కోశాధికారి ఎం.కృష్ణ, జిల్లా కార్యదర్శి టి.శివలింగం, జి.ప్రవీణ్ కుమార్, సమగ్ర శిక్ష ఉద్యోగులు బాలకిషన్, నవీన్, సావిత్రి, నాగదేవత తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

కోటిలింగేశ్వరాలయ హుండీ లెక్కింపు

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని శ్రీ ఉమా పార్థివ కోటి లింగేశ్వరాస్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. 5 నెలల హుండీ ఆదాయం రూ.3,87,793 సమకూరినట్టు ఆలయ అధికారులు, నిర్వాహకులు తెలిపారు. అనంతరం కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్మకం కోసం వేలం పాట నిర్వహించగా ఏడాదికి రూ.3,15లక్షలు వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ వ్యవస్థాపకులు తడ్కమడ్ల ఈశ్వరయ్య, ఆలయ కార్యనిర్వహన అధికారి రవికుమార్, ఇన్స్పెక్టర్ రంగారావు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోటను పరిశీలించిన అధికారులు



ఆరేపల్లిలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

రాయపోల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం ఆరేపల్లిలో ఆయిల్ పామ్ తోటలను బుధవారం మండల ఉద్యానవన అధికారి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఆయిల్ పామ్ తోటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలను వివరించారు. ఆయిల్ పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు.

ఫామ్‌పాండ్ పనుల పరిశీలన

మద్దూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నూరు గ్రామంలో ఉపాధిహామీ పథకంలో రైతు నర్సయ్య పొలంలో చేపడుతున్న ఫామ్‌పాండ్ నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో ఎస్. రాంమోహన్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఫామ్‌పాండ్ నిర్మాణ పనులకు కనీసం 30 కూలీలు హాజరయ్యే విధంగా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. అనంతరం ఉపాధిహామీ పథకంలో హార్టీకల్చర్ కింద. రైతులు సంపత్ 2.50 ఎకరాలు, రాంబాబు 2 ఎకరాలు, పద్మ 3 ఎకరాలలో నాటుకున్న మామిడి మొక్కల్ని పరిశీలించారు. మొక్కలను జాగ్రత్త చూసుకోవాలని సూచించారు.గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు.

కవితోత్సవంలో చేర్యాల కవికి సన్మానం

చేర్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా మంత్రాలయ శ్రీగురు రామవేంద్ర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొన్న చేర్యాల పట్టణానికి చెందిన కవి వుప్పాల ప్రభాకర్ పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఆయన పద్యపఠనం చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు కళావేదిక సీఈవో కత్తిమండల ప్రతాప్, జాతీయ అధ్యక్షుడుఈశ్వరి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమొంటో అందుకున్నారు.

'జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి'

సిద్దిపేట అర్బన్/గజ్వేల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఆర్పీలను రెగ్యులరైజ్ చేసి కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ బుధవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి ఆర్పీలతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో సుమారు 6000 మంది ఆర్పీలుగా కొనసాగుతున్నారని మహిళలకు రుణాలను ఇప్పించడం, సకాలంలో చెల్లించేలా చూడటం లో ఆర్పీలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జీవో 60 ప్రకారం వారికి కనీస వేతనాలు అందించి ఉద్యోగ భద్రత కల్పించి, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలందరికీ 6 నెలలుగా బకాయిపడిన జీతాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, ఆర్పీల సంఘం సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభద్ర డిమాండ్ చేశారు ఈ మేరకు గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. వారివెంట ఆర్పీల సంఘం నాయకులు కల్పనా, ఫాతిమా, పద్మ, మనోహరి, లావణ్య, సుధారాణి, జ్యోతి తదితరులున్నారు.

రైల్వేస్టేషన్‌కు భూసేకరణ కోసం గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న కొమురవెల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణ

చేర్యాల, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ నిర్మాణానికి అదనంగా అవసరమైన భూసేకరణ నిమిత్తం అధికారులు బుధవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌లో భాగంగా గతంలో చేపట్టిన రైల్వేలైన్ కోసం గతంలో భూసేకరణ చేపట్టారు. కానీ ప్రస్తుతం రైల్వేస్టేషన్ నిర్మాణం జరుగుతున్న క్రమంలో అదనంగా 6-13ఎకరాల స్థలం అవసరం కావడంతో, ఆ భూమి సేకరణ నిమిత్తం సంబంధిత రైతులతో తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ధరణి పోర్టల్ ప్రకారం ఎకరాకు రూ.2.25లక్షలు ఉందని తెలపగా, మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.15లక్షలకుపై ఉందని రైతులు తమ అభిప్రాయం వ్యక్తంచేశారు. రైతులు తెలిపిన అంశాలను అధికారులు నోట్‌చేసుకున్నారు. అభ్యంతరాలుంటే దరఖాస్తు ద్వారా తెలపాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని సూచించారు. సమావేశంలో రైల్వే ఏఈ సంజీవ్‌కుమార్ డిప్యూటీ ఎమ్మార్వో వేణుగోపాల్‌రావు, చేర్యాల సీఐ ఎల్. శ్రీను, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 38 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం/గజ్వేల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 38 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం ఆయా కోర్టుల్లో హాజరుపరచగా న్యాయాధికారులు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వాహన తనిఖీల్లో 22 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా రూ.41వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16మంది వాహనదారులు పట్టుబడినట్టు ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. వారిని గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట కోర్టులో హాజరుపరచగా రూ. 8వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్టు సీఐ వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గజ్వేల్/చేర్యాల, డిసెంబరు 18(ఆంధ్ర జ్యోతి): సీఎంఆర్‌ఎఫ్‌ను నిరుపేదల సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. సీఎం సహాయనిధి ద్వారా పలువురు బాధితులకు మంజూరైన చెక్కులను బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అదేవిధంగా చేర్యాలమండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.8లక్షల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ ఎమ్మెల్సీ నాగ పురి రాజలింగం బుధవారం పట్టణంలోని తన నివాసంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురికిరణ్‌కుమార్, మాజీ సర్పంచు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రవిచందర్, వెంకటేశ్, శ్రీనివాస్, బాలరాజు, డానియల్, కనకయ్య, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎస్సీ ఎస్టీ చైర్మన్

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన చెట్టుపల్లి ఎల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సీ ఎస్టీ కమిటీ జిల్లా చైర్మన్ బక్కి వెంకటయ్య బుధవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, ఆమె కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ఇన్నోవేషన్ పార్కుకు స్థల పరిశీలన

కోహెడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రాల గ్రామంలో ఇన్నోవేషన్ పార్కుకోసం ఆర్డీవో రామ్మూర్తి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సురేఖ, ఆర్ఐ సురేందర్ తదితరులు ఉన్నారు

'ఎన్టీఆర్ ఘాట్‌ను తొలగించాలనడం సబబుకాదు'

చేర్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన మాజీ సీఎం ఎన్టీఆర్ ఘాట్‌ను తొలగించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొనడం సబబుకాదని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి ఒగ్గు రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన చేర్యాలలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వైఖరిపై మండిపడ్డారు.

హరీశ్‌రావు జోలికి వస్తే ఊరుకోం

సిద్దిపేట రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి);అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ చేసిన అనుచిత వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య అన్నారు. హరీశ్‌రావు జోలికి వస్తే ఉరుకునేదిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కోమటిరెడ్డి అసెంబ్లిలో మాట్లాడే భాషను ప్రజలు అందరు వీక్షిస్తున్నారన్నారు.

సబ్-పోస్టాఫీస్‌ను తరలించొద్దు

చేర్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని సబ్-పోస్టాఫీసును తరలించవద్దని పేర్కొంటూ బుధవారం మాజీ సర్పంచు పెడుతల ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పోస్టల్ అధికారికి వినతిపత్రం అందించారు.

'విద్యార్థి విజ్ఞాన్ మంతన్' టెస్టులో

దామరకుంట విద్యార్థినికి జాతీయస్థాయి బహుమతి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మండల విద్యాధికారి వెంకటరాములు

మర్కుక్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలోనే అతిపెద్ద సైన్స్ టాలెంట్ పరీక్ష అయిన 'విద్యార్థి విజ్ఞాన్ మంతన్- 2024'లో 8వ తరగతి చదువుతున్న దామరకుంట విద్యార్థిని దాల్ పూజ జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచిందని ఎంఈవో, పాఠశాల హెచ్‌ఎం వెంకటరాములు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంస్థ ద్వారా ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాల ఇన్నోవేషన్ మారథాన్-2024లో, జాతీయస్థాయి వినూత్న ఆలోచనలు సేకరణలో భాగంగా పాఠశాల నుంచి 6 టీమ్స్ ద్వారా 6 వినూత్న ఐడియాలను, ప్రాజెక్ట్ నమూనాలను ఆన్లైన్‌లో పొందుపరిచిన సందర్భంగా 18మంది విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ చిన్న బ్రహ్మయ్యకు ప్రశంసాపత్రాలను అందజేశారు. వీరి నమూనాలు ఎంపికైతే, సదరు ప్రాజెక్టు అభివృద్ధి కోసం రూ.1,20,000 నుంచి 1,50,000 వరకు కేంద్ర ప్రభుత్వము అందజేస్తుందని వెంకటరాములు తెలిపారు.

సిద్దిపేటలో జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో బుధవారం జీవశాస్త్ర జిల్లాస్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఇంగ్లిష్ మీడియం విభాగంలో ఇర్కోడ్ ఆదర్శ పాఠశాల విద్యార్థి వేణు ప్రథమ స్థానంలో నిలవగా, రెండోస్థానంలో మర్పడగ విద్యార్థిని అభివర్షిక నిలిచారు. తెలుగుమీడియం విభాగంలో చీకోడు పాఠశాల విద్యార్థిని భువన ప్రథమ స్థానం దక్కించుకోగా వెల్కటూర్ పాఠశాల విద్యార్థిని సంజన ద్వితీయ స్థానంలో నిలిచారు. వారు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ తెలిపారు.

- చేర్యాల: మండలంలోని నాగపురి జడ్పీఎస్ఎస్‌లో నిర్వహించిన ఆంగ్ల భాష ప్రతిభా పాటవ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ ఉపాధ్యాయుడు అందె విజయ్‌కుమార్ విరాళంగా అందించిన బహుమతులను హెచ్‌ఎం అయిలయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డ్రాయింగ్ బుక్, వాటర్ స్కెచెస్, ఆంగ్ల డిక్షనరీలను అందజేశారు.

మంచినీటి సరఫరా పనుల కోసం రూ.4.90లక్షలు

- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో మంచినీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత తెలిపారు. బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పైపులైన్లు, స్టాటర్లు, గేట్‌వాల్వ్, మోటార్ల పనుల నిమిత్తం రూ. 4.90 లక్షలు కేటాయించేందుకు తీర్మానించారు. ఎల్లమ్మ చెరువు ఊర కాలువలో ఉన్న ముళ్ల పొదలు, రాళ్ల కుప్పలను తొలగించేందుకు రూ. 3.96 లక్షలు కేటాయించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న వైకుంఠధామం నిర్వహణ ఆదిజాంబవ మాదిగ సంక్షేమ సంఘానికి ఇచ్చేందుకు తీర్మానించారు. ఇందులో 26 అంశాలపై కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, బోజు రమాదేవి, పెరుక భాగ్యారెడ్డి, చిత్తారి పద్మ, గోవింద్ రవి, దొడ్డి శ్రీనివాస్, జనగామ రత్న, వాల సుప్రజ, వల్లపు రాజు, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్ తదితరులు ఉన్నారు.

ఏపీజీవీబీ సేవలకు అంతరాయం

సిద్దిపేట రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీజీవీబీ పుల్లూరు బ్యాంకు సేవలకు ఈ నెల 28 నుంచి 31 వరకు అంతరాయం ఏర్పడుతుందని బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ గుడిసె విజయ్ తెలిపారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఏపీజీవీబీ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో కలుస్తున్నందున బ్యాంకు సేవలు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లాంటి సేవలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో వసూల్ రాజాలు!

(5వ పేజీ తరువాయి)

శాడు. ఇక ఇక్కడ ఏ పరిశ్రమ అయినా సరే సదరు అధికారికి ముట్టజెప్పాల్సిన పరిస్థితే దాపురించింది.

తుక్కాపూర్ సబ్ డివిజన్‌లోనూ..

తుక్కాపూర్ సబ్ డివిజన్ పరిధిలోని కొండపాక, కుకునూర్‌పల్లిలో అధికారుల వసూళ్ల పర్వంపై అనేక ఆరోపణలు ఉన్నాయి. గతంలో ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో కొంత ఆచితూచి వ్యవహరించిన అధికారులు ప్రస్తుతం తమ నోటికి, చేతికి పని చెబుతున్నారు. తమకు కావాల్సినంత ఇస్తేనే ఫైలును ముందుకు జరుపుతున్నారు. లేనిపక్షంలో నెలల పాటు పెండింగ్‌లో పెట్టి విద్యుత్ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నా రు. కుకునూరుపల్లిలో ఓ భవనానికి సంబంధించి వినియోగదారుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. విద్యుత్ అధికారుల సూచన మేరకు మానవతా దృక్పథంతో బయటివారికి తన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కనెక్షన్ ఇచ్చారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శబ్దాలు రావడంతో విషయాన్ని సదరు అధికారికి చేరవేయగా, బూతులతో సదరు అధికారి వినియోగదారుడిపై విరుచుకుపడినట్లు తెలిసింది. ఇక ఓ భూమిని వెంచర్‌గా ఏర్పాటు చేయడంతో అప్పటివరకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్(అగ్రికల్చర్) తీసివేయాలని కోర గా, ఓ అధికారి ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ.60వేలకు అమ్మినట్లు సమాచారం. కొండపాక మండలంలో ఎలాంటి ఎస్టిమేషన్ లేకుండా రూ.70వేలకు వైర్, స్తంభాలను అమ్మిన ఓ అధికారి.. ఆ తర్వాత ఎస్టిమేషన్ వేసి తక్కువ ఖర్చును డిస్మంకు చూపినట్లు తెలుస్తుంది. ఇలా యథేచ్ఛగా అధికారులు డబ్బులను కొల్లగొడుతున్నారు.

ఏళ్లుగా ఆఫీసులోనే తిష్ఠ వేసిన సిబ్బంది

గజ్వేల్‌లోని ఈఆర్‌వో కార్యాలయంలో ఏళ్ల తరబడి సిబ్బంది తిష్టవేశారు. ఏ పనిచేయాలన్నా ఓ రేటు ఫిక్స్ చేసుకుని యథేచ్ఛగా అమ్యామ్యాలు లాగుతున్నారు. ఎక్కడ ఏ పనిని పక్కకు పెడితే ఎంత డబ్బు వస్తుందో తెలియడంతో అదే ఆఫీసులో పొజిషన్లను మార్చుకుంటూ ట్రాన్స్‌ఫర్ల నిలుపుదల చేసుకుంటున్నారు. మీటర్ కావాలన్నా, ఇంకా ఏ ఇతర పని కావాలన్నా తప్పనిసరిగా చేయి తడపాల్సిన పరిస్థితి ఉంది. ఇదే పరిస్థితి జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో ఉన్నట్లు తెలుస్తుంది.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాయపోల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పంచాయతీ కార్మికులతో కలిసి రాయపోల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటాచారి, నర్సింలు, బాబు, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు: సీఐ

నంగునూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణపై మండలంలోని అక్కెనపల్లి మోడల్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సోషల్ మీడియా, సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జానయ్య, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గజ్వేల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్లు బి.సైదా, ఎం. మురళీ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయా చట్టాలు, ట్రాఫిక్ నియమ, నిబంధనలపై వారు బుధవారం అవగాహన కల్పించారు. డయల్-100 ప్రాముఖ్యతను వివరిస్తూ, రోడ్డు భద్రత గూర్చి వివరించారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ బీఆర్ఎస్ నాయకురాలు సునీత ఇంట్లో బుధవారం జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, బీఆర్ఎస్ నియోజవర్గ అధికార ప్రతినిధులు అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య, నాయకులు ఉన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

బెజ్జంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత దళిత హక్కుల ఉద్యమ జాతీయ రెండవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ కోరారు. జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.